



జగనన్న కాలనీని పరిశీలించిన ఆర్డీఓ

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): మండలంలోని జగనన్న కాలనీలో గృహనిర్మాణాలను వేగవంతం చేయాలని శ్రీకాళహస్తి ఆర్డీఓ కెఎస్ రామారావు అధికారులను ఆదేశించారు. శనివారం బీడీ కాలనీ(జగనన్న లేఅవుట్)లో ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. కాలనీలో నిర్మాణంలో ఉన్న 434 ఇళ్లలో ఇటీవల 54 పూర్తయ్యాయి. మిగిలిన ఇంటి వాటిని జనవరి 31వ తేదీలోపు పూర్తి చేసి లబ్ధిదారులకు ఇవ్వాలని ఆర్డీఓ ఆదేశించారు. బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నా ఇంటి నిర్మాణాలను వేగవంతం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు సకాలంలో పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ సుబ్రమణ్యం, ఎంపీడీఓ తరుణాక్షిరెడ్డి, ఏపీఓ సుజాత, హౌసింగ్ ఏఈ సుబ్రమణ్యం, పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


బీడీ కాలనీలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు





ట్యాబ్‌లు పంపిణీ


ట్యాబ్‌లు అందజేస్తున్న మోహనరెడ్డి

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం సర్పంచ్ తాతేకాల్వ మోహనరెడ్డి ఆధ్వర్యంలో 15 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు కన్నలి మోహనరెడ్డి, ఎంపీటీసీ బొడుగు శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రవి



బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని జంబుగోళం గ్రామానికి చెందిన ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవిని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి ఓ ప్రకటనలో తెలిపారు.


















క్లుప్తంగా

అందరూ సుఖసంతోషాలతో ఉండాలి



శ్రీకాళహస్తి: నూతన ఆంగ్ల సంవత్సరంలో నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రైతులు పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రజల ఆకాంక్షలకు తగ్గట్టు తమ ప్రభుత్వం 2023లోనూ పరిపాలన చేస్తుందని పేర్కొన్నారు.

శనైశ్వరస్వామికి తైలాభిషేకం



తైలాభిషేకం చేస్తున్న అర్చకుడు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనైశ్వరస్వామికి శనివారం తైలాభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్ల అభిషేకం అనంతరం ప్రతి శనివారం ఈ పూజలు నిర్వహిస్తారు. తొలుత కలశప్రతిష్ఠ, గణపతి పూజ చేసి కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం స్వామివారికి నువ్వులనూనె, మంచినూనె, పంచామృతంతో అభిషేక అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు.

వెలుగు ఏపీఎం బదిలీ



చంద్రబాబు

వరదయ్యపాళెం: మండల వైఎస్సార్ క్రాంతిపథకం(వెలుగు) ఏపీఎం చంద్రబాబును కేవీబీ పురం మండలానికి బదిలీ చేస్తూ తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ పీడీ శనివారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో తిరుమలరాజును నియమించారు. నకిలీ డ్వాక్రా సంఘాల పేరిట వెలుగు సిబ్బంది మండలంలో రూ. 2.5కోట్లను పక్కదారి పట్టించడం విదితమే. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో విచారణ అనంతరం నవంబర్ 25న చంద్రబాబును ఏపీఎంగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బాధ్యతలు స్వీకరించిన 35 రోజులకే ఆయన్ను బదిలీ చేయడం వెనుక కారణాలు తెలియాల్సి ఉంది.

కనులపండువగా కిరీట సంప్రోక్షణ



బంగారు కిరీటాన్ని సంప్రోక్షణ చేసేందుకు తీసుకెళ్తున్న ఆలయ చైర్మన్ రామ్మోహన్‌రావు

గూడూరు: ప్రసన్న వేంకటేశునికి బంగారు కిరీట సంప్రోక్షణ కనులపండువగా జరిగింది. పట్టణంలోని రాజావీధి ప్రాంతంలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్ కంఠి రామ్మోహన్‌రావు, పాలక మండలి సభ్యులు కలిసి, దాతల సాయంతో రూ.53 లక్షలతో బంగారు కిరీటాన్ని తయారు చేయించారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీకంఠి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ 1వ తేదీ నుంచి 2వ తేదీ వరకు భక్తుల దర్శనార్థం స్వామి వారికి కిరీటాన్ని అలంకరిస్తారన్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.

ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి సేవలు మరువలేనివి

– లోక్‌సభ ప్యానల్ స్పీకర్, ఎంపీ మిథున్‌రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డిని సత్కరిస్తున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే వెంకటేగౌడ, వీసీ రాజారెడ్డి

తిరుచానూరు: ఎస్వీయూనివర్సిటీ రెక్టార్, సైకాలజీ విభాగపు ప్రొఫెసర్ వి.శ్రీకాంత్‌రెడ్డి సేవలు మరువలేనివని లోక్‌సభ ప్యానల్ స్పీకర్, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి తెలిపారు. ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి ఎస్వీయూ రెక్టార్‌గా శనివారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను సెనేట్ హాల్‌లో సన్మానించారు. ఇందులో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ శ్రీకాంత్‌రెడ్డి విద్యా బోధన, పరిశోధన, విస్తరణ రంగంలో విశేష కృషి చేశారని తెలిపారు. భవిష్యత్‌లోనూ విద్యా రంగానికి ఆయన సేవలు ఎంతో అవసరమన్నారు. ఎస్వీయూ వీసీ ప్రొఫెసర్ కె.రాజారెడ్డి మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డి బోధన, పరిశోధన, ప్రిన్సిపాల్, సీడీసీ డీన్, రెక్టార్‌గా విశేష సేవలు అందించారని కొనియాడారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మహ్మద్ హుస్సేన్, ప్రిన్సిపాళ్లు పద్మనాభం, శ్రీనివాసులురెడ్డి, ఓఆర్‌వి విభాగం ప్రొఫెసర్ పీసీ.వెంకటేశ్వర్లు, పలమనేరు ఎమ్మెల్యే వెంకటే గౌడ, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నేతలు మురళి, కిషోర్‌దాస్, సుధాకర్, తేజశ్వర్‌రెడ్డి, యూనివర్సిటీ ఉద్యోగ సంఘం నేతలు సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో విజయమే లక్ష్యం



హాజరైన కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

- సచివాలయ కన్వీనర్ల శిక్షణలో ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపు

నారాయణవనం: సచివాలయ కన్వీనర్లు రాబోవు ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. సోమవారం ఉదయం నూతన సచివాలయ కన్వీనర్ల శిక్షణ కార్యక్రమాన్ని స్థానికంగా ఒక కల్యాణ మండపంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వారికి దిశానిర్దేశం చేశారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని, పలు రాష్ట్రాల మంత్రులు, అధికారులు మన గ్రామ స్థాయి పాలనా యంత్రాంగ పనితీరును పరిశీలిస్తున్నారని అన్నారు. అదే పంథాలో ప్రతి సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లు, ప్రతి 50 కుటుంబాలకు ఇద్దరు గ్రామ సారథులను పార్టీ నియమించిందని అన్నారు. ప్రతి గ్రామ సారథి తమ పరిధిలో ని 25 కుటుంబాలకు జగనన్న ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ ఆ కుటుంబాలు పొందిన లబ్ధిని వివరించాలని అన్నారు. అర్హులందరికి పథకాల ఫలాలు అందేలా చూడటం, సమస్యల పరిష్కారం లోనూ వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని అన్నారు. ప్రతిపక్షాలు చేసే అసత్య ఆరోపణలు, కుట్రలతో పాటు సామాజిక మాధ్యమాల్లో వచ్చే దుష్ప్రచారాలను, ఎల్లో మీడియా తప్పుడు ప్రచారాన్ని ఎప్పటికప్పుడు ఎండగడుతూ ప్రజలకు తెలియజేయాలన్నారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శనరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గుణశేఖర్, పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, ఏకాంబరం, అన్నాదొరై, సుధాబాబు, పళనిరెడ్డి, బాలాజిరెడ్డి, రమేష్, ఏలుమలై, సర్పంచులు సాయిరవి, నాగూరు, రత్న, స్వర్ణ, ధర్మలింగం, సుబ్రమణ్యంరెడ్డి, మురుగేశం, గుణశేఖర్, నాగూరు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయకార్యదర్శులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతి పల్లెకూ ఆర్టీసీ సేవలు



జెండా ఊపి మండలం బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

పిచ్చాటూరు: ప్రతి పల్లెకూ ఆర్టీసీ సేవలు అందించాలన్నదే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో పిచ్చాటూరు–హనుమంతాపురం బస్సు సర్వీసును ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణులు, విద్యార్థుల సౌకర్యార్థం పునరుద్ధరించినట్లు చెప్పారు. ఈ బస్సు మండలంలోని 80 శాతం గ్రామాలను కలుపుతూ నడవడం వల్ల మండలం బస్సు అని పేరొచ్చిందన్నారు. ఈ బస్సును దివంగత నేత ఎన్‌టీ రామారావు హయాంలో ప్రారంభిస్తే చంద్రబాబు పాలనలో రద్దు చేశారన్నారు. ఈ సర్వీసు రద్దు మూలాన పడుతున్న ఇబ్బందులు ప్రజలు తనకు నివేదించడంతో పునరుద్ధరణకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నూతన ఆంగ్ల సంవత్సరంలో అందరికీ మంచే జరగాలని.. ముఖ్యమంత్రి జగనన్న నేతృత్వంలో రాష్ట్రంతో పాటు తన సత్యవేడు నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం కేవీ.రమణ, తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంపీపీ హెచ్.రేఖ, వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ కేటీ హరిశ్చంద్రా రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, విద్యార్థి విభాగ రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రమేష్ రాజు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ శేఖర్ రెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ పాల పద్మనాభం, వైఎస్‌ఆర్ టీయూసీ అధ్యక్షులు మునిరాజ, నాయకులు గోవిందన్, చలపతిరాజు, రిప్‌సూధన్ రావు, మోహన్, ఆర్ఎస్.రాజు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



గురు దక్షిణామూర్తి సన్నిధిలో జమ్ము కాశ్మీర్ గవర్నర్ మనోజ్‌సిన్హా

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని శనివారం శ్రీలంక దేశ హౌసింగ్, అర్బన్ డెవలప్‌మెంట్‌శాఖ మంత్రి ప్రసన్న రణతుంగ, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మల్లు భట్టి విక్రమార్క , జమ్ము కాశ్మీర్ గవర్నర్ మనోజ్‌సిన్హా, వైజాగ్ సౌత్ జోన్ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ తదితరులు దర్శించుకున్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే జమ్ము కాశ్మీర్ గవర్నర్‌కు ఆర్డీఓ రామారావు, అంజూరు జ్ఞాపికను అందజేశారు.

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



అంజిమేడులో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏర్పేడు: మండలంలోని అంజిమేడు, ఏర్పేడు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో శనివారం తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా చేశారు. పట్టభద్రులను కలిసి ప్రథమ ప్రాధాన్యత ఓటును పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డికి వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం(ఆర్పీడీఎస్) అధ్యక్షుడు జలదంకి మదన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ తిరుమలయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు కన్నలి మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, సర్పంచ్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు మన్యం రాజారెడ్డి, నాయకులు లోకనాథరెడ్డి, చెవిరెడ్డి వెంకటనారాయణరెడ్డి, భాస్కర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ల్యాంకో పరిశ్రమ ఎదుట చిందేపల్లె గ్రామస్తుల ధర్నా

- పరిశ్రమ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని డిమాండ్
- శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు



ల్యాంకో పరిశ్రమ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

శ్రీకాళహస్తి రూరల్: ల్యాంకో పరిశ్రమ యాజమాన్యం అరాచకాలకు తట్టుకోలేకపోతున్నామని, వారిపై కేసులు నమోదు చేయాలంటూ డిమాండ్ చేస్తూ శనివారం మండలంలో రాచగున్నేరి సమీపంలోని ఆ పరిశ్రమ ఎదుట ఏర్పేడు మండలం చిందేపల్లె గ్రామస్తులు ఆందోళన చేశారు. వారు మాట్లాడుతూ, తమ గ్రామం ఆవిర్భావం నుంచీ గ్రామంలోకి రహదారి ఉందని, ఆ దారికి అడ్డంగా పరిశ్రమ యాజమాన్యం గోడ కట్టటం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. తమ గ్రామ లింకురోడ్డును ఆక్రమించి గేటు ఏర్పాటు చేయటం దారుణమన్నారు. అంతేకాకుండా బలవంతంగా రోడ్డును మూసివేసి రాకపోకలను అడ్డుకోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రహదారి మూసివేసి ముళ్లపొదల్లో వెళ్లాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారని మండిపడ్డారు. జిల్లా కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రూరల్ ఎస్‌ఐ వెంకటేష్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంచలయ్య, పుల్లయ్య, సుబ్రమణ్యంరెడ్డి, వెంకటయ్య, రంగయ్య, బాలకృష్ణ, మణి, గురవయ్య పాల్గొన్నారు.

మనోన్మణి ఉత్సవం



శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం వైభవంగా మనోన్మణి (గొబ్బెమ్మ) ఉత్సవం నిర్వహించారు. ధనుర్మాసం పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ వరకు ఈ ఉత్సవం నిర్వహించనుండటం విదితమే. తొలుత ఆలయ అలంకార మండపంలో అమ్మవారికి పలు రకాల అభిషేక పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. చప్పరాలపై అధిష్టించి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

- శ్రీకాళహస్తి

'సిద్ధార్థ'లో ఫ్రెషర్స్ డే



సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆ కళాశాలల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ, జూనియర్ విద్యార్థులు సాంకేతిక విద్యలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. సీనియర్లు జూనియర్లకు అకడమిక్ సందేహాలను నివృతి చేస్తూ వారికి మార్గదర్శనం చేస్తూ ఉండాలని సూచించారు.విద్యాలలందరూ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుని ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు డాక్టర్ చంద్రశేఖరరెడ్డి, జనార్ధనరాజు, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- నారాయణవనం

కళామిత్ర పురస్కారం ప్రదానం



ఫరీద్ దంపతులకు పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు

వెంకటగిరి: పట్టణంలోని పద్మశ్రీ ఘంటసాల కళాక్షేత్రం ఆధ్వర్యంలో జరిగిన శతాబ్ది గాయకుడు ఘంటసాల శతజయంతి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రేణిగుంటకు చెందిన కళాకారుడు ఫరీద్ దంపతులకు కళామిత్ర పురస్కారం అందజేశారు. కళాక్షేత్రం అధ్యక్షుడు బి.సుబ్బయ్య, రాయలసీమ రంగస్థలి తిరుపతి సంస్థ నిర్వాహకుడు కేఎస్.రాజా, జి.లలిత, సుంకరరవి, చిరంజీవులు, శంకర్, ప్రసాద్, పి.రవి పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



ఇళ్ల నిర్మాణాలపై ఆరాతీస్తున్న కమిషనర్ అనుపమ అంజలి

తిరుపతి తుడా: జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అధికారులను ఆదేశించారు. ఆమె శనివారం జీపాళెం వద్ద నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ సకాలంలో పనులు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జీ పాళెంలో ఇళ్ల నిర్మాణాలకు ముందుకొచ్చిన లబ్ధిదారుల సహకారంతో ఇరవై ఇళ్లను గృహ ప్రవేశాలకు సిద్ధం చేస్తున్నట్లు డీఈ మహేష్ కమిషనర్‌కు వివరించారు. అదేవిధంగా సుమారు వంద ఇళ్ల స్థలాల్లో లీగల్ ఇబ్బందులు రావడంతో వారికి ఆ లేఅవుట్లలోనే సర్వే చేసి కొత్తగా ప్లాట్లు కేటాయించినట్టు తెలిపారు. హౌసింగ్ సిబ్బంది, సెక్రటరీలు పాల్గొన్నారు.

క్యాలెండర్లు, డైరీల ఆవిష్కరణ



యూటీఎఫ్ డైరీలు, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ డైరీలు, క్యాలెండర్లను ఆ అసోసియేషన్ మండల అధ్యక్షుడు ఈశ్వరయ్య, కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఎంఈఓ రవీంద్రనాథ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రవిచంద్ర, సహాధ్యక్షులు షాహిదాబేగం, శివారెడ్డి, కోశాధికారి సతీష్‌కుమార్, జిల్లా మహిళా కమిటీ సభ్యులు దీపిక తదితరులు పాల్గొన్నారు.

తొట్టంబేడులో..




తొట్టంబేడు : విద్యావనరుల కేంద్రం వద్ద..

తొట్టంబేడు (శ్రీకాళహస్తి రూరల్) : స్థానిక మండల విద్యా వనరుల కేంద్రం వద్ద శనివారం యూటీఎఫ్ నూతన సంవత్సర క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓ భారతి ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ తిరుపతి జిల్లా సహాధ్యక్షులు కేఎస్. సూర్యప్రకాష్, జిల్లా కార్యదర్శి జీ.శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్ మార్టిన్, జిల్లా సాంకేతిక విభాగం కన్వీనర్ ఓ.విజయ్ కుమార్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోర్టులో ఉన్న భూమి ఆక్రమణకు యత్నం

చంద్రగిరి: కోర్టులో కేసు నడుస్తున్న భూమిని ఆక్రమించడానికి యత్నించిన ఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. మండలంలోని పనపాకం పంచాయతీ అరిగెలవారిపల్లి చెరువు సమీపంలో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 30 ఏళ్ల క్రితం ఆ భూమి అటవీశాఖకు చెందినదని అటవీ అధికారులు హద్దుల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. రెవెన్యూ అధికారులు ఆ భూమి తమదేనంటూ కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తోంది. ఈ భూమిని ఆక్రమించుకోవడానికి కొంత మంది శనివారం యత్నించారు. టీడీపీకి చెందిన ఓ నాయకుడు జేసీబీ, ట్రాక్టర్లతో భూమిని చదును చేశారు. సమాచారం అందుకున్న పనపాకం అటవీశాఖ అధికారులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. వివాదంలో ఉన్న భూమిలో పనులు ఎలా చేస్తారంటూ వారిపై మండిపడ్డారు. ఆక్రమణదారులు తప్పించుకోవడం కోసం.. రోడ్డు మరమ్మతుల కోసం మట్టిని తీసుకుంటున్నట్లు అధికారులను నమ్మించే యత్నం చేశారు. అనంతరం సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించి, మరోసారి ఈ భూమిలోకి అక్రమంగా ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై డీఆర్‌ఓ చిన్నబాబు మాట్లాడుతూ వివాదంలో ఉన్న భూమిలో గ్రావెల్‌ను తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బంది అక్కడికి చేరుకున్నారని తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా స్టేట్‌మెంట్ తీసుకుని పంపించినట్టు పేర్కొన్నారు.

పారదర్శకంగా సామాన్యులకు శ్రీవారి దర్శనం



మీడియాతో మాట్లాడుతున్న పోకల అశోక్‌కుమార్

తిరుపతి మంగళం : టీటీడీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి, ద్వాదశి రోజుల్లో సామాన్య భక్తులకు పెద్ద పీట వేస్తూ పారదర్శకంగా శ్రీవారి దర్శనం కల్పించనున్నట్లు టీటీడీ బోర్డు సభ్యుడు పోకల అశోక్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం బైరాగిపట్టెడలోని కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల్లో వీఐపీల తాకిడి ఎక్కువగా ఉండేదన్నారు. ఈ సారి వీఐపీ ప్రొటోకాల్, బ్రేక్ దర్శనాలు రద్దు చేసి సామాన్య భక్తులకే ప్రాధాన్యం ఇచ్చినట్టు తెలిపారు. తిరుపతి ప్రజలకు శ్రీవారి దర్శనం కల్పించేందుకు 9 కౌంటర్లను ఏర్పాటు చేసి 7 లక్షల టోకెన్లు ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. భక్తులు వారికి కేటాయించిన సమయం ప్రకారమే తిరుమలకు వచ్చి దర్శనం చేసుకోవాలని కోరారు.

రచయిత షణ్ముగంకు వన్నూరమ్మ పుస్తకం అందజేత

తిరుచానూరు: వన్నూరమ్మ.. ఎదురులేని పాలెగత్తే... పుస్తకాన్ని ప్రముఖ రచయిత ఎస్వీ యూనివర్సిటీ విశ్రాంత ప్రొఫెసర్ వి.షణ్ముగంకు రచయిత బొమ్మిశెట్టి రమేష్ శనివారం అందజేశారు. షణ్ముగం మాట్లాడుతూ రాయలసీమలో ఏకైక మహిళా పాలెగత్తె వన్నూరమ్మ అని తెలిపారు. 1781 నుంచి 1796 వరకు ఆమె ఎదురులేని పాలెగత్తెగా మట్లి రాజులు, నిజాం నవాబులు, గోల్కొండ నవాబులు, టిప్పు సుల్తాన్, హైదరాలి తదితరుల వెన్నులో వణుకు పుట్టించిందని తెలిపారు. భర్త చిన్న నరసింహ నాయుడు మరణానంతరం నల్లమల అటవీ ప్రాంతంలో ఒంటరి పోరాటం సాగించారని పేర్కొన్నారు. వన్నూరమ్మ పత్ర నాయుడు వంశానికి చెందినదని తెలిపారు. ఆమె చరిత్రను రమేష్ ప్రపంచానికి తెలియచేయడం అభినందనీయమన్నారు. యూనివర్సిటీ లైబ్రరీ జూనియర్ అసిస్టెంట్ షేక్ సలీంకు కూడా వనూరమ్మ పుస్తకాన్ని రచయిత అందజేశారు.

2023 పాఠకులకు, ప్రకటన కర్తలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు 2023

పెంచలకోనలోప్రత్యేక క్యూలు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో నూతన ఆంగ్ల సంవత్సరాదికి వచ్చే భక్తులకు ప్రత్యేక క్యూలు, లడ్డూ కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఏసీ వెంకటసుబ్బయ్య తెలిపారు. ఆలయంలో నూతన సంవత్సరాదికి ప్రత్యేక ఏర్పాట్లు ఉండవని నిత్యం జరిగే పూజలు మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు.

ముస్తాబైన ఆలయాలు, చర్చిలు

నారాయణవనం : ఆంగ్ల నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాలను విద్యుత్ దీపాలు, అరటి బోదెలతో అలంకరించారు. పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు టీటీడీ అనుబంధ ఆలయాలను వేకువ జామున 3 గంటలకు తిరుప్పావై పాశురాలతో తెరచి శుద్ధి, ధనుర్మాస పూజల అనంతరం ఉదయం 4 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని ఆలయ అధికారి నాగరాజు తెలిపారు. భక్తుల కోసం సాధారణ, ప్రత్యేక, వీఐపీ క్యూలను ఏర్పాటు చేశామని, అలాగే క్యాలెండర్లు, డైరీలను వెంకన్న ఆలయంలో విక్రయిస్తున్నట్లు ఆయన తెలిపారు. స్థానిక సారకాయల స్వామి ఆలయం, నారాయణవనంలోని రామాలయం, ధర్మరాజుల ఆలయం, పాలమంగళం పాళేశ్వరస్వామి ఆలయం, శింగిరి కోనలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయం నూతన సంవత్సర వేడుకలకు ఏర్పాట్లు చేశారు. కొన్ని ఆలయాల్లో మధ్యాహ్నం అన్నదానం చేయనున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగలో..

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని దేవాలయాలు, చర్చిలు నూతన ఆంగ్ల సంవత్సరాది వేడుకలకు ముస్తాబయ్యాయి. దేవాలయాలు, చర్చిలను విద్యుద్దీపాలు, ప్లాస్టిక్ పూలతో అలకరించారు. ప్రత్యేక పూజలు చేయనున్నారు. చర్చిలలో శనివారం రాత్రి నూతన సంవత్సర ప్రత్యేక ఆరాధన కార్య్రక్రమాలు నిర్వహించారు.



నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన క్యూలు



బుచ్చినాయుడకండ్రిగ : పల్లమాలలో దీపాలంకరణలో అభయాంజనేయస్వామి దేవాలయం



ప్రసన్న వెంకటేశ్వర ఆలయంలో..

● కోయిల్ అళ్వార్ తిరుమంజనం



మండలంలోని వికృతమాల సంతాన సంపద వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఆలయ ధర్మకర్త పసుసులేటి హరిప్రసాద్ ఆధ్వర్యంలో కోయిల్ అళ్వార్ తిరుమంజన సేవను వేదపండితులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు, ప్రత్యేక క్యూలు, వైకుంఠ ద్వారాన్ని ఏర్పాటు చేశారు.

\- ఏర్పేడు

మొక్కలు ఇవ్వండి

నాయుడుపేటటౌన్: అధికారులు, నాయకులకు పూలబొకేలు కాకుండా పర్యావరణం పరిరక్షించుకునేలా మొక్కల పంపిణీ చేయాలని స్థానిక జనవిజ్ఞాన వేదిక నాయకులు పిలుపునిచ్చారు. డీఎస్పీ, రెవెన్యూ కార్యాలయం ఆవరణలో శనివారం తహసీల్దార్ రాజేంద్ర, అధికారులతో మొక్కలు నాటించారు.